క్లుప్తంగా

రాజేందర్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ విభాగం పరిశోధకుడు జెట్టి రాజేందర్‌కు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. పొలిటికల్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ట్రైబల్ ఉమెన్, ఎస్టడీ విత్ రెఫరెన్స్ టు పంచాయతీరాజ్ ఇనిస్టిట్యూషన్స్ ఇన్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి రాజేందర్‌కు డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కె రాజేందర్ తెలిపారు. ఆ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ సిహెచ్.దినేస్‌కుమార్ పర్యవేక్షణలో రాజేందర్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఆశీర్వాదం



కాజీపేట: తెలంగాణ మాదిగ రాజకీయ పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చిలివేరు ఆశీర్వాదంను నియమిస్తూ మంగళవారం రాష్ట్ర అధ్యక్షుడు బొక్కల వెంకటస్వామి ఆదేశాలు జారీ చేశారు. కాజీపేట మండలం కడిపికొండ గ్రామానికి చెందిన ఆశీర్వాదం ఉద్యమ స్ఫూర్తిని గుర్తించి రాష్ట్ర కమిటీలో అవకాశం కల్పించారు. ఈ మేరకు కాజీపేటలో నియామక ఉత్తర్వులను ఆశీర్వాదం అందుకున్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తులు 7 వరకు గడువు

న్యూశాయంపేట : సీ శాట్–2025–26 ప్రవేశ పరీక్ష ఉచిత శిక్షణ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు ఈనెల 7 వరకు గడువు ఉందని డైరెక్టర్ షెడ్యూల్ కులాల అధ్యయన కేంద్రం (టీఎస్ ఎస్సీ స్టడీ సర్కిల్) డాక్టర్ కే.జగన్‌మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలో ప్రతిభ కనబర్చడానికి ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీ డిగ్రీ నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు హనుమకొండ ఎస్సీ స్టడీ సర్కిల్‌లో సంప్రదించాలని కోరారు.

నిషేధిత మందులు స్వాధీనం



తనిఖీల్లో పాల్గొన్న డ్రగ్ కంట్రోల్ టీం అధికారులు, సిబ్బంది

రామన్నపేట : నగరంలోని రంగశాయిపేటలోని ఆయుష్ ఫార్మసీలో నిషేధిత డ్రగ్స్ మందులు విక్రయిస్తున్నారని వచ్చిన పక్కా సమాచారంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ డ్రగ్ కంట్రోల్ టీం మంగళవారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున నిషేధిత డ్రగ్స్ మందులను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. తనిఖీల్లో ఆర్ఐ శివ కేశవులు, ఆర్ఎస్సై మనోజ్, పూర్ణ, నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం పెంచాలి

నయీంనగర్ : లోక్‌సత్తా ఉద్యమ సంస్థ, ఫౌండేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పోచమ్మకుంట యూపీహెచ్‌సీలో ఆరోగ్య సర్వే నిర్వహించారు. లోక్‌సత్తా ఉద్యమ సంస్థ సమన్వయకర్త బి.రాంమోహన్ రావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల పనితీరుపై ప్రజలకు నమ్మకం కలిగించడానికి అన్ని ప్రభుత్వ ఆసుపత్రులపై ఆరోగ్య సర్వే చేస్తున్నామని తెలిపారు.

బీరన్న బోనాల జాతరకు బందోబస్తు ఏర్పాటు

హన్మకొండ కల్చరల్ : ఈ నెల 6న తొలి ఏకాదశిని పురస్కరించుకని శ్రీబీరన్న స్వామి బోనాల జాతరకు పెద్ద ఎత్తున పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయిస్తానని వరంగల్ ఏసీపీ నాగరాజు శుభం ప్రకాశ్ అన్నారు. మంగళవారం 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్లి రవి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఏసీపీని కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపి బందోబస్తు ఏర్పాటుపై వినతిపత్రం అందజేశారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా కమిటీలు చొరవ చూపాలని, పోలీస్‌శాఖ నుంచి పెద్ద త్తున బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఏసీపీ చెప్పారు.

పాల సమాజం కమిటీ ఎన్నిక

హన్మకొండ కల్చరల్ : హనుమకొండ పాల సమాజం కమిటీ ఎన్నికలు మంగళవారం వరంగల్ ఉర్సులోని సెంటినరి తెలుగు బాప్టిస్టు చర్చిలో నిర్వహించారు. క్రైస్తవ నాయకులు మంద సురేందర్ బాబు అధ్యక్షతన జరిగిన ఎన్నికల్లో ముఖ్యఅతిథిగా రుద్రోజు జయప్రకాష్ హాజరై మాట్లాడారు. అనంతరం రెండేళ్ల పాటు కొనసాగే కమిటీని ఎన్నుకున్నారు. హనుమకొండ పాల సమాజం అధ్యక్షుడిగా డాక్టర్ జేజే థామస్ ప్రభాకర్, ఉపాధ్యక్షులుగా కోట విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా మంద సురేందర్ బాబు, సహాయ కార్యదర్శిగా పోలెపాక రవీందర్ సుమన్, కోశాధికారిగా జయప్రకాశ్‌తో కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

ఆఫీస్.. అస్తవ్యస్తం

కార్యాలయంలో నిరుపయోగంగా పాత బీరువాలు



పేరుకుపోయిన దుమ్ము





బల్దియా కార్యాలయంలో పెచ్చులూడిన సీలింగ్

బల్దియా కార్యాలయ నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. కార్యాలయ ఆవరణలో, లోపల దుమ్ముధూళి నిలిచిపోయింది. బల్దియా పరిధిలో అభివృద్ధి పనులకు సంబంధించి ఏ ఫైల్ కదలాలన్నా.. ఇక్కడి నుంచే. అంతటి ప్రాధాన్యమున్న ఈ కార్యాలయ నిర్వహణను పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. ఎక్కడ చూసినా పాత దస్త్రాలు, బీరువాలు, దుమ్ముధూళి, ఊడిపోయిన సీలింగ్ దర్శనమిస్తున్నాయి. నగరాన్ని శుభ్రంగా ఉంచడంలో కీలకపాత్ర వహిస్తున్న కార్పొరేషన్ అధికారులు కార్యాలయాన్ని మాత్రం పట్టించుకోవట్లేదని పనులపై వచ్చే ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

– సాక్షిస్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్



పనిచేయని ఫ్రిడ్జ్



కుప్పలుగా పడి ఉన్న దస్త్రాలు

సంక్షిప్త సమాచారం

రంగశాయిపేటలో యువకుడి బలవన్మరణం



శివసాయికుమార్ (ఫైల్)

హన్మకొండ కల్చరల్ : ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడిన సంఘటన రంగశాయిపేటలో చోటు చేసుకుంది. మిల్స్‌కాలనీ పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. రంగశాయిపేటకు చెందిన గుండు సదానందం కుమారుడు శివసాయికుమార్(29) సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. సోమవారం మృతుడి సోదరి ఇంట్లో ఫంక్షన్‌కు వెళ్లారు. సాయంత్రం శివసాయి కుమార్ ఇంటికి చేరుకున్నారు. రాత్రి కుటుంబ సభ్యులు ఇంటికి చేరుకోగా ఫ్యానస్‌కు ఉరివేసుకుని వేలాడుతూ విగతజీవిగా ఉన్నాడు. పోలీసులకు చెప్పడంతో మిల్స్‌కాలనీ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. ఆర్థిక ఇబ్బందులే ఆత్మహత్యకు కారణమని స్థానికులు తెలిపారు. మృతుని తండ్రి సదానందం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కాజీపేట జంక్షన్‌లో కొట్టుకున్న బెగ్గర్స్

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ ముందు మంగళవారం రెండు బెగ్గర్స్ వర్గాల మధ్య మాటమాట పెరిగి ప్రయాణికులు చూస్తుండగా కొట్టుకున్నారు. ఒక వర్గం బెబెగ్గర్స్ మరో వర్గం బెగ్గర్స్‌లో ఒకతను కర్రతో మహిళా తలపై కొట్టగా కింద పడిపోయింది. మహిళను ఎందుకు కొట్టావని అడగడానికి ప్రయత్నించిన మరో బెగ్గర్ తలపై బండరాయితో మోదగా అతను రక్తస్రావంతో కిందపడిపోయాడు. ఇదంతా నిత్యం ప్రయాణికుల రాకపోకలు, అధికారుల రాకపోకల చేసే కాజీపేట జంక్షన్ ఎదుట జరిగింది. ప్రాణాలు పోయే విధంగా ఘర్షణ పడి రక్త స్రావంతో లేచి వెళ్లడంతో బెగ్గర్స్‌కు ఎలాంటి సోయిలేకుండా ఉండడంతో వారు గంజాయి తీసుకొని ఉంటారని ఘర్షణ చూస్తున్న ప్రయాణికులు, రైల్వే కార్మికులు అనుమానం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకొని రైల్వే పోలీసులు వచ్చి వారిని బెదిరించగా వెళ్లిపోయారు.

మొక్కలు నాటిన పర్యావరణ ప్రేమికులు

కాజీపేట : గ్రేటర్ పరిధిలోని 63వ డివిజన్ విద్యానగర్ కాలనీ ప్ర భుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం పద్మశ్రీ అవార్డు గ్రహీత, వనజీవి రామయ్య 88వ జయంతి సందర్భంగా విరివిగా మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షకుడు దేశం కోసం ప్రకాష్ విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతలను స్వీకరించారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

విద్యారణ్యపురి: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ప్రగతిశీల ప్రజాస్వామిక విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణ, రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం డీఈఓ కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు వినతిపత్రం సమర్పించారు.

అక్రమనిర్మాణాన్ని కూల్చివేసిన అధికారులు

వరంగల్ చౌరస్తా : వరంగల్ మండలం మట్టెవాడ గ్రామ పరిధిలోని ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 442లో అక్రమ నిర్మాణాన్ని మంగళవారం కూల్చివేసినట్లు తహసీల్దార్ ఎక్బాల్ తెలిపారు. గ్రీవెన్‌సెల్‌లో అందిన ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఆ ప్రభుత్వ స్థలంలో బోర్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆ స్థలంలో ఎవరైనా నిర్మాణానికి పాల్పడితే శిక్షార్హులవుతారని పేర్కొన్నారు.

సమాజ సేవలో లయన్స్ ఆదర్శంగా నిలవాలి

కాజీపేట అర్బన్ : సమాజ సేవలో పోటీపడుతూ లయన్స్ క్లబ్ సభ్యులు సమాజంలో ఆదర్శంగా నిలవాలని నూతన లయన్స్ గవర్నర్ డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య తెలిపారు. హంటర్‌రోడ్డు న్యూశాయంపేటలోని లయన్స్ భవన్‌లో సోమవారం రాత్రి నిర్వహించిన థౌజండ్ పిల్లర్స్ లయన్స్ క్లబ్ 27వ ఇన్‌స్టాలేషన్ వేడుకలకు ముఖ్య అతిథిగా చంద్రశేఖర్ ఆర్య పాల్గొని మాట్లాడారు. 2025–26 సంవత్సరానికి లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా రాష్ట్రపతి అవార్డు గ్రహీత, లయన్ పరికిపండ్ల వేణు, ప్రధాన కార్యదర్శిగా వైద్యం రాజగోపాల్, కోశాధికారిగా అన్వేష్‌ల చేత మల్లిపుల్ కార్యదర్శి వెంకటేశ్వరరావు ప్రమాణస్వీకారం చేయించి సన్మానించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని వివిధ విభాగాల్లో పార్ట్‌టైం లెక్చరర్లుగా పని చేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని అప్పటివరకు అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి నోటిఫికేసన్ ఇవ్వొద్దని మంగళవారం కేయూవీసీ ఆచార్య కె ప్రతాప్‌రెడ్డికి పార్ట్‌టైం లెక్చరర్లు విన్నవించారు. అకాడమిక్ కమిటీహాల్‌లో ఆయా పార్ట్‌టైం అధ్యాపకులతో సమావేశం అయిన వీసీ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం పై ఇంకా స్పష్టత రాలేదన్నారు.

మహాసభను జయప్రదం చేయాలి

మడికొండ : గొర్రెలు, మేకల పెంపకందారులు ఈనెల 4న హనుమకొండలో నిర్వహించనున్న మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల రమేశ్ పిలుపునిచ్చారు. మంగళవారం కాజీపేట మండలం రాంపూర్‌లో చలో హనుమకొండ వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు.

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానం రద్దు చేయాలి

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేశ్



ఎంజీఎం : కేఎంసీ ప్రిన్సిపాల్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు

ఎంజీఎం : కాకతీయ మెడికల్ కాలేజీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ చేయాలని కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని జూలై 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెకు సంబంధించిన నోటీసును మంగళవారం కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్‌కుమార్‌రెడ్డికి నాయకులతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష,కార్యదర్శులు ధర్మ, రవీందర్, నవీన్, గీత, పాల్గొన్నారు..

మహాధర్నాను జయప్రదం చేయండి

ఎన్‌టీపీసీలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 9న నిర్వహించే మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉద్యోగ సంఘం నేతలు డిమాండ్ చేశారు.

వరంగల్ చౌరస్తా : దేశవ్యాప్తంగా జూలై 9న జరిగే కార్మిక సమ్మెలో ఆల్ మిల్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు, సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొనాలని యూనియన్ నాయకుడు శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి రెడ్డి, వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, జిల్లా రైస్‌మిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులకు సమ్మె నోటీసు అందచేసినట్లు పేర్కొన్నారు.

బట్టలబజారులో

బట్టలబజార్ రామన్నపేట వరంగల్ పట్టణ గృహ నిర్మాణ తాపీమేస్త్రీల సంఘం అధ్యక్ష కార్యదర్శులు దుగ్యాల రాజయ్య, సదానందం మిత్రులందరికీ సమ్మె నోటీస్ అందజేసినట్లు సీఐటీయూ వరంగల్ జిల్లా కార్యదర్శి అరూరి కుమార్ తెలిపారు.

హసన్‌పర్తి: ఈనెల 9న దేశవ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి పుల్లా అశోక్ పిలుపునిచ్చారు. మంగళ పీహెచ్‌సీ వైద్యాధికారి రాంభార్గవ్‌కు సమ్మె నోటీసు అందజేశారు.

వీడియో జర్నలిస్ట్‌కు నివాళి



రాంప్రసాద్ భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న ప్రెస్‌క్లబ్, యూనియన్ల బాధ్యులు

నయీంనగర్: గుండెపోటుతో మృతిచెందిన వీడియో జర్నలిస్ట్ హరిణి రామ్ ప్రసాద్ మృతదేహానికి మంగళవారం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో ప్రెస్ క్లబ్ బాధ్యులు, యూనియన్ల నాయకులు, జర్నలిస్టులు పూలమాలలు వేసి, నివాళులర్పించి వారి కుటుంబానికి అండగా ఉంటామని కుటుంబసభ్యులను ఓదార్చారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ తరపున వారి కుటుంబానికి రూ.25వేలు తక్షణ సాయం అందజేశారు. నివాళులర్పించిన వారిలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, యూనియన్ల నాయకులు వీడియో జర్నలిస్టులు, జర్నలిస్టులు ఉన్నారు.

కొండా దంపతుల ఆర్థికసాయం

హన్మకొండ కల్చరల్ : వరంగల్ కరీమాబాద్‌కు చెందిన సీనియర్ కెమెరామెన్ రాంప్రసాద్ అకాల మరణంపై మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు దంపతులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మంగళవారం కాంగ్రెస్ నాయకులు మీసాల ప్రకాష్, కొత్తపెల్లి శ్రీనివాస్, సదానందం ద్వారా ఆర్థికసాయం పంపించారు.

మృతికి సంతాపం

హన్మకొండ : వృత్తిపట్ల నిబద్ధత, నిజాయితీ కలిగిన జర్నలిస్టు వీడియో జర్నలిస్టు హరిణి రాంప్రసాద్‌ను కోల్పోవడం బాధాకరమని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాంప్రసాద్ మృతికి సంతాపం ప్రకటించారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

కాజీపేట రూరల్ : మండలంలోని బిల్డింగ్ పెయింటింగ్ మేస్త్రీ వర్కర్స్ యూనియన్ కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని యూనియన్ గౌరవ అధ్యక్షుడు మైసారపు సిరిల్ లారెన్స్ అన్నారు. స్థానిక బాపూజీనగర్‌లో మంగళవారం యూనియన్ కార్మికులందరూ కలిసి 47వ డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సిరిల్ లారెన్స్‌ను గౌరవ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా లారెన్స్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలను ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించనున్నట్లు, కాజీపేటలో ఎమ్మెల్యే కార్మిక భవన్ నిర్మాణం చేపట్టబోతున్నట్లు అన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు గబ్బెట ఎల్లేష్, కనకం శివకుమార్, ఎస్.కె.జలీల్, కీర్తిసురేష్, భిక్షపతి, రాజు, సతీష్, శ్రీనివాస్, రాజ్‌కుమార్, లాజర్, లక్ష్మణ్, శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

● సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

హన్మకొండ కల్చరల్ : బీజేపీ పాలనలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నా రు. మంగళవారం ఖిలా వరంగల్ కోటలో సీపీఐ నాయకులు ఓర్సు రాజు, తాళ్లపల్లి జాన్‌పాల్ అధ్యక్షతన సీపీఐ మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. అటవీ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టడానికే ఆపరేషన్ కగార్‌ను అమలు చేస్తున్నారని విమర్శించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల రమేష్, జిల్లా కార్యదర్శి మేకల రవి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

దాడులు జరగకుండా ప్రభుత్వంతో చర్చిస్తా

రామన్నపేట : విశ్వకర్మల సమస్యలపై అటవీశాఖ అధికారులతో సమావేశం నిర్వహించి దాడులు జరగకుండా ప్రభుత్వంతో చర్చిస్తానని శాసనసమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ పేర్కొన్నారు. మంగళవారం వరంగల్ భద్రకాళీ రోడ్డులోని కీర్తిగార్డెన్‌లో విశ్వకర్మ కుటీర పరిశ్రమలకు నాల్గవ కేటగిరీలో 10 హెచ్‌పీ నుంచి 25 హెచ్‌పీ వరకు విద్యుత్‌లోడ్ పెంచినందుకు విద్యుత్ ఈఆర్‌సీకి అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కులవృత్తుల సర్వే చేయించి వాటిపై ఆధారపడిన వారికి ప్రభుత్వ పరంగా ప్రోత్సత్సాహకాలు అందేలా చూస్తానన్నారు.

గుర్రెపు డెక్క, వ్యర్థాలను తొలగించాలి

వరంగల్ అర్బన్ : నగర పరిధిలో ఉన్న చెరువుల్లో గుర్రెపు డెక్క విపరీతంగా పేరుకుపోయిందని దానిని వెంటనే తొలగించాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్‌కు చిన్నవడ్డేపల్లి చెరువు ఆక్రమణ ఏరియాల పరిరక్షణ కమిటీ బాధ్యులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్‌ని కలిసి వినతిపత్రాన్ని అందచేశారు.

టీజీ ఎన్పీడీసీఎల్ డైరెక్టర్‌కు సన్మానం

హన్మకొండ : టీజీ ఎన్పీడీసీఎల్ హెచ్ఆర్‌డీ అండ్ ఐఆర్ డైరెక్టర్ సి.ప్రభాకర్‌ను ఎన్పీడీసీఎల్ రజక ఉద్యోగులు మంగళవారం సన్మానించారు. నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలోని చాంబర్‌లో ఇటీవల డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రభాకర్‌ను రజక ఉద్యోగులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు.

సంగారెడ్డి ఘటనపై సమగ్ర విచారణ జరపాలి

న్యూశాయంపేట : సంగారెడ్డి జిల్లా పాశమైలారం ఘటనపై సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం వరంగల్ కలెక్టరేట్ ఏఓ విశ్వప్రసాద్‌కి వినతిపత్రం అందించారు. సిగాచి కెమికల్ ఫ్యాక్టరీలో జరిగిన దుర్ఘటనలో ఇప్పటికి 40 మందికి పైగామరణించారని చాలామంది గాయాలపాలయ్యారని, కొంతమంది జాడ తెలియడం లేదన్నారు.

డీఎస్‌ఏ నాయకుల అరెస్ట్‌పై నిరసన

విద్యారణ్యపురి: రాష్ట్రంలో నెలకొని ఉన్న విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీ ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని మాసబ్ ట్యాంకు వద్ద ధర్నా చేపట్టారని, వారిని పోలీసులు అరెస్ట్ చేయటం సిగ్గుచేటని డీఎస్‌ఏ జిల్లా కన్వీనర్ ఉప్పుల శివ అన్నారు. అరెస్టును నిరసిస్తూ మంగళవారం హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కేడీసీ ఎదుట తమ నిరసన తెలిపారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన రాజనాల

వరంగల్ చౌరస్తా : రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌ను మంగళవారం హైదరాబాద్‌లోని కాంగ్రెస్ భవన్‌లో శాప్ మాజీ డైరెక్టర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాజనాల శ్రీహరి మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ కోసం చేసిన సేవలను ఆయన అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లి తనకు న్యాయం చేయాలని కోరారు.

డ్రెయినేజీ పనుల పరిశీలన

హన్మకొండ కల్చరల్ : ఖిలా వరంగల్ పడమరకోట అగర్తల చెరువు వద్ద మంగళవారం స్థానిక రైతులతో కలిసి జీడబ్ల్యూఎంసీ డిప్యూటీ ఇంజనీర్ ముజామిల్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, కార్పొరేటర్ ఉమా దామోదర్ యాదవ్ డ్రెయినేజీ పనులను పరిశీలించారు.

జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

కేయూ క్యాంపస్ : హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా కళాశాలలో ఎకనామిక్స్ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 25, 26 తేదీల్లో డిజిటల్ ఎకనామి ద ఇంపాక్ట్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఆన్ గ్లోబల్ మార్కెట్ అంశంపై జాతీయ సదస్సును నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను మంగళవారం ఆర్ట్స్‌అండ్ సైన్స్ కాలేజీలో ఆ సెమినార్ కన్వీనర్ పద్మ ఆవిష్కరించారు.

యాక్షన్ ప్లాన్‌లో భాగస్వాములు కావాలి

కాజీపేట అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పరిసరాల పరిశుభ్రతకు చేపట్టిన వంద రోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని సానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్ తెలిపారు. 44వ డివిజన్ పరిధిలోని భట్టుపల్లిలో మంగళవారం యాక్షన్ ప్లాన్‌లో భాగంగా గ్రామస్తులకు తడి,పొడి చెత్త అందజేతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించి మాట్లాడారు.

వైద్య వృత్తిలో యువత ప్రవేశించాలి

వైద్య వృత్తిలో యువత ప్రవేశించాలని, సమాజానికి సేవ చేసే గొప్ప అవకాశంగా యువత భావించాలని తెలంగాణ రాష్ట్ర శాసనమండలి డిప్యూటి చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్, పలువురు వక్తలు అన్నారు. జాతీయ డాక్టర్స్ డే ను పురస్కరించుకుని మంగళవారం వరంగల్‌లోని శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యునైటెడ్ నేషన్స్ రిసోర్స్ సెంటర్ –నార్త్ ఈస్టర్న్ రీజియన్ తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ వైద్యులు దేవుళ్లతో సమానంగా చూడాలని, ఆపత్కాలంలో వైద్యుల కృషి అనిర్వచనీయమని కొనియాడారు. గుండె వైద్య నిపుణులు డాక్టర్ రామక శ్రీనివాస్, మాజీ ఎంజీఎం సూపరిండెంటెంట్ డాక్టర్ పి.చంద్రశేఖర్, డాక్టర్ సాంబమూర్తి, డాక్టర్ చంద్రశేఖర్ ఆర్యా, డాక్టర్ కొణతం కృష్ణ,ప్రముఖ వై ద్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వైద్యులు, తదితరులు పాల్గొన్నారు. – సాక్షి, నెట్‌వర్క్



హన్మకొండ కల్చరల్ : మాట్లాడుతున్న మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్



వరంగల్ చౌరస్తా : వైద్యులను సన్మానిస్తున్న పరపతి సంఘాల ప్రతినిధులు



హన్మకొండ అర్బన్ : డాక్టర్స్, సీఏలతో రోటరీ క్లబ్ బాధ్యులు



కాజీపేట రూరల్ : రైల్వే ఆస్పత్రిలో డాక్టర్స్‌ను సన్మానిస్తున్న రైల్వే నాయకులు

బాల్య వివాహాలపై 100కు డయల్ చేయండి

కాజీపేట: చదువుకునే వయస్సులో వివాహాలు చేయడానికి ప్రయత్నిస్తే వెంటనే 100 డయల్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కే యూ పాలక మండలి సభ్యురాలు డాక్టర్ అని తారెడ్డి అన్నారు. కాజీపేట మండలం సోమిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో బాల్య వివాహాలపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సును ఆమె ప్రారంభించారు. షెడ్యూల్డ్ కులాల హక్కుల అభివృద్ధి సమితి కార్మిక వి భాగం రాష్ట్ర అధ్యక్షులు యమడాల అనుకాంత్, హెచ్ఎం శోభ, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె.సులోచన, హుస్సేన్, హరీష్, చందు, అజీజ్, రజిత పాల్గొన్నారు.

టీజీ క్యాబ్ చైర్మన్‌కు సన్మానం



హన్మకొండ: తెలంగాణ కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్, వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావును డీసీసీబీ అధికారులు, ఉ ద్యోగులు సన్మానించారు. రాష్ట్ర, జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఉద్యోగులకు వేతన సవరణ చేసిన సందర్భంగా మంగళవారం నక్కలగు ట్టలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో చైర్మన్ రవీందర్‌రావుకు ఉ ద్యోగుల సంఘం నాయకులు, అధికారులు, ఉద్యోగులు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. సీఐఓ వజీర్ సుల్తాన్, తెలంగాణ సహకార బ్యాంకు ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణమోహన్, జిల్లా కార్యదర్శి నాగరాజు, జి ల్లా అధ్యక్షురాలు రజిత, జనరల్ మేనేజర్లు ఉషశ్రీ, పద్మావతి, డీజీఎం అశోక్, ఏజీఎంలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అన్‌మ్యాన్డ్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్లకు అవకాశమివ్వాలి

హన్మకొండ : జూనియర్ లైన్‌మెన్ పోస్టుల భర్తీకి విడుదల చేసే నోటిఫికేషన్‌లో అన్‌మ్యాన్డ్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్లకు అవకాశం కల్పించాలని సీఐటీయూ అనుబంధ తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (టీఈఈయూ) నాయకులు కోరారు. మంగళవారం నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డిని టీఈఈయూ ఎన్పీడీసీఎల్ కంపెనీ శాఖ అధ్యక్షుడు జి.అంజనేయులు, కార్యదర్శి బి.వెంకటరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ప్రసాద్, నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రం సమర్పించారు. అంతకు ముందు ఇటీవల బాధ్యతలు స్వీకరించిన డైరెక్టర్లు సి.ప్రభాకర్, వి.మోహన్‌రావు, వి.తిరుపతి రెడ్డి, టి.మధుసూదన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీఈఈయూ వరంగల్, హనుమకొండ జిల్లాల కార్యదర్శులు ఎల్.శ్రీనివాస్, ప్రశాంత్, జనగామ, భద్రాచలం జిల్లా అధ్యక్షులు కుమారస్వామి, కె.శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

ప్రకటన

(రిజిస్ట్రేషన్ దస్తావేజు కనిపించుట లేదు)

[illegible]

(సి.హెచ్. ఆగారెడ్డి)

అడ్వకేట్–నోటరి

తేది: 27-06-2025

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వరంగల్ అర్బన్:

9951602875 9553955722 9010299096

Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

ఎల్. రాజేష్ వర్మ (SR) : 9885438059 (హన్మకొండ)
వి. రాజ్ కుమార్ (SR) : 9966290903 (హన్మకొండ)
కె. రవీందర్ (SR) : 9705236356 (వరంగల్)
పి.చంద్రశేఖర్ (ACO) : 9963646944 (వరంగల్)